# శుద్ధిచేయువాని అగ్ని

ఆషిష్ రాయ్‌చూర్

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | శుద్ధిచేయువాడు పనిలో నిమగ్నమైయున్నాడు | 1 |
| 2. | శుద్ధి చేయుట కొరకైన అగ్ని | 3 |
| 3. | పరీక్షించుట కొరకైన అగ్ని | 5 |
| 4. | ఏమిటా అగ్ని | 7 |
| 5. | అగ్ని వలన ప్రతివానికి ఉప్పు సారము కలుగును | 11 |
| 6. | మనము అగ్ని గుండా నడచినప్పుడు | 13 |
| 7. | దీనియంతటి విలువ | 15 |

# 1

# శుద్ధిచేయువాడు పనిలో నిమగ్నమై యున్నాడు

**"ఆ మూడవ భాగమును నేను అగ్నిలో నుండి వెండిని తీసి శుద్ధపరచినట్లు శుద్ధపరతును. బంగారమును శోధించినట్లు వారిని శోధింతును, వారు నా నామమును బట్టి మొఱ్ఱపెట్టగా నేను వారి మొఱ్ఱను ఆలకింతును. వీరు నా జనులని నేను చెప్పుదను, యెహోవా మా దేవుడని వారు చెప్పుదురు"** (జెకర్యా 13:9).

**"దేవా, నీవు మమ్మును పరిశీలించి యున్నావు. వెండిని నిర్మలము చేయురీతిగా మమ్మును నిర్మలులను చేసియున్నావు. నీవు బందీ గృహములో మమ్ము ఉంచితివి. మా నడుముల మీద గొప్ప భారము పెట్టితివి. నరులు మా నెత్తిమీద ఎక్కునట్లు చేసితివి మేము నిప్పులలోను నీళ్ళలోను పడితిమి అయినను నీవు సమృద్ధిగల చోటికి మమ్ము రప్పించియున్నావు"** (కీర్తన 66:10-12)

ఒక లోహమును దాని మిశ్రమ లోహము నుండి శుద్ధమైన లోహముగా వేరుచేయుట నెరిగిన వాడే శుద్ధిచేయుటలో సఫలీకృతుడు (బంగారు పనివాడు లేక వెండి పనివాడు). అతడు ముడిలోహాన్ని శుద్ధి చేసే అగ్నిలో కరిగిస్తాడు. వెండిని శుద్ధి చేసే ప్రక్రియలో ముడిలోహానికి సీసాన్ని కలుపుతారు. తగరం దహించబడుచున్న కొలది సీసం కూడా దహించబడుతుంది. మష్టు (వ్యర్థ పదార్థాలు) తొలగించబడిన తరువాత ఆ లోహమును తగిన రూపంలో లేక అలంకరణ వస్తు రూపంలో మలచుకొనవచ్చును. ఈ ప్రక్రియలో లోహాన్ని వంచడం, సుత్తితో కొట్టడం, మలాము చేయుట (పలచని కోటింగ్ వేయుట), దళసరి పొరలుగా వేయడం మరియు ఇంకా పలు విధానాలు ఇమిడియున్నాయి. ముడి లోహాన్ని శుద్ధిచేయుటలో అగ్ని చాలా ముఖ్యము.

దేవుడు తన ప్రజలను శుద్ధిచేయువాడని బైబిల్ మనకు బోధిస్తున్నది. "వెండిని శోధించి నిర్మలము చేయువాడైనట్లు కూర్చుని యుండును. లేవీయులు నీతిని అనుసరించి యెహోవాకు నైవేద్యములు చేయునట్లు వెండి బంగారములను నిర్మలము చేయురీతిని ఆయన వారిని నిర్మలులను చేయును" (మలాకీ 3:3) దేవుడు భవిష్యత్తులో తన ప్రజల మధ్య చేసే పనిని ఈ వాక్యభాగము తెలియజేయు చున్నప్పటికీ, దేవుడు నేడు మరియు ఈ ఘడియలో కూడా తన ప్రజలను శుద్ధి చేయ ఇష్టపడుచున్నాడని లేఖన భాగము నుండి మనము గ్రహించవచ్చు. శుద్ధీకరణ ప్రక్రియకు అగ్నిని తప్పక వాడాలి. లోహము యొక్క స్వభావమును పరీక్షించుటకు మరియు శుద్ధిచేయుటకు

అగ్ని వాడబడింది. దేవుడు అగ్నిని శుద్ధీకరణ ప్రక్రియకు నియమించి, ఆయన తన ప్రజలను దాని గుండా పంపించుచున్నాడు. బాప్తిస్మమిచ్చు యోహాను యేసును పరిచయం చేసినప్పుడు, యేసు పరిశుద్ధాత్మలోను మరియు అగ్నితోను ప్రజలకు బాప్తీస్మ మిచ్చుటకై వచ్చెనని అతడు చెప్పెను. "మారుమనస్సు నిమిత్తము నేను నీళ్ళలో మీకు బాప్తిస్మమిచ్చుచున్నాను. అయితే నా వెనుక వచ్చుచున్నవాడు నా కంటే శక్తిమంతుడు, ఆయన చెప్పులు మోయుటకైనను నేను పాత్రుడను కాను. ఆయన పరిశుద్ధాత్మలోను అగ్నితోను మీకు బాప్తిస్మమిచ్చును" (మత్తయి 3:11).

'శుద్ధిచేయు' అను దానికి హెబ్రీ పదం 'ట్సరాఫ్' — అనగా 'కరిగించుట' 'శుద్ధిచేయుట', 'పవిత్రపరచుట', 'అగ్నితో శోధించుట', 'పరిశోధించుట' మరియు 'పరీక్షించుట'. ప్రశస్తమైన లోహములను కరిగించుట ద్వారా వ్యర్థ పదార్థములను తొలగించు ప్రక్రియను తెలియపరచుటకు ఈ క్రియా పదము వాడబడింది. దేవుడు తన ప్రజలను శుద్ధి చేయుటకు వాడే అగ్ని ఏదో లేఖనములను పరిశీలించుట ద్వారా మనం తెలుసుకుందాము. దేవునికి తమ్మును తాము అప్పగించుకొన్న వారి జీవితాల్లో మరియు హృదయాల్లో ఆయన పనిచేసే మార్గాలను తెలుసుకొనుటనునది ఆశక్తికరమైనది. దేవుడు తన ప్రజలతో వ్యవహరించే, పనిచేసే మార్గాలను మరియు విధానాలను మనము ఎంత అధికముగా తెలుసుకుంటే, మనమంత సులభంగా లోబడి ఆయనతో అడుగులు వేయగలం. ఆయన క్రియ చేసే మార్గాలను గూర్చి మనం అజ్ఞానంగా ఉన్నప్పుడే మనము కఠిన మనస్కులమై మన సొంత మార్గాలను వెంబడించాలనుకొంటాము. మన దేవుడు తన ప్రజలను నిర్మలము చేయువానివలె మరియు శుద్ధిచేయువాని వలె కూర్చుని యున్నాడని మనము గ్రహించుటకు దేవుడు మనకు కృపను అనుగ్రహిస్తాడు. ముడతయైనను లేక మచ్చయైనను లేనటువంటి సంఘము కొరకు యేసు మరలా వచ్చును. అందుకు గాను శుద్ధీకరణ విధానము తప్పక అవసరమై యున్నది. దేవుని ఉద్దేశ్యములు మరియు మార్గములను గూర్చి ఈ పుస్తకము మనల్ని బుద్ధిమంతులుగా చేస్తుంది.

# 2
# శుద్ధిచేయుట కొరకైన అగ్ని

**"నీవు అంతరంగములో సత్యము కోరుచున్నావు. ఆంతర్యమున నాకు జ్ఞానము తెలియజేయుదువు"** (కీర్తన 51:6)

అగ్ని శుద్ధీకరణకు ఒక చిహ్నం. ఇది పవిత్రతను మరియు శుద్ధిని నిర్వహిస్తుంది. ఇశ్రాయేలీయులు యుద్ధానికి వెళ్ళి కొల్లగొట్టిన సొమ్మును తెచ్చినప్పుడు, వారు అగ్నిచేత చెడని ప్రతి వస్తువును అగ్నిలో వేసి తీయాలని దేవుడు వారికి ఆజ్ఞాపించెను. "అనగా అగ్నిచేత చెడని సమస్త వస్తువులను మాత్రము అగ్నిలో వేసి తీయవలెను, అప్పుడవి పవిత్రమగును" (సంఖ్యా 31:23a). అందుచేత, అగ్ని, దానిగుండా ప్రయాణించిన ప్రతి దానిని పవిత్రపరిచే ప్రభావాన్ని కలిగియుంది.

దేవుడు మన అంతరంగములో—మన అంతరంగ పురుషునిలో సత్యమును కోరుచున్నాడని బైబిల్ మనకు బోధిస్తున్నది. హెబ్రీ భాషలో సత్యమనగా 'రూఢియైనది', 'నిశ్చలమైనది' మరియు 'నమ్మశక్యమైనది'. ఇది ఆధారపడదగిన, ధృఢమైన మరియు నమ్మదగిన భావాన్ని వ్యక్తపరుస్తుంది. ప్రజలు సత్యవంతులుగా, దేవుని రాజ్యము యొక్క నిత్య ఐశ్వర్యము పట్ల నమ్మకస్థులుగా, నేడు మరియు ఈ ఘడియలో దేవుని కొరకు నిలువబడుటకై ఆయనపై ఆధారపడ గలిగే ప్రజగా — ఇటువంటి లక్షణాలను కలిగియుండాలని దేవుడు కోరుచున్నాడు.

దేవుని ప్రజలు పాపముచేసి మరియు దుష్టత్వములో తిరుగులాడినప్పుడు, "నా హస్తము నీ మీద పెట్టి క్షారము వేసి నీ మష్టును నిర్మలము ('ట్సరాఫ్', శుద్ధి) చేసి నీలో కలిపిన తగరమంతయు తీసివేసెదను" (యెషయా 1:25). ఈ సందర్భంలో "మష్టు" మరియు "తగరము" అలంకార రూపకముగా పాపమును తెలుపుచున్నాయి. దేవుడు తన ప్రజల మధ్యకు తీసుకొని వచ్చే పవిత్రపరిచే తన ప్రక్రియను గూర్చి మరియు ఆయన శుద్ధిచేయువాడనే సాదృశ్యమును దేవుడు మరియొక సారి వినియోగించెను. యిర్మియా గ్రంథములో కూడా ఇటువంటి వివరణను మనము చూస్తాం. "నీ నివాసస్థలము కాపట్యము మధ్యనే యున్నది, వారు కపటులై నన్ను తెలిసికొన నొల్లకున్నారు, ఇదే యెహోవా వాక్కు". "కావున సైన్యములకధిపతియగు యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు–ఆలకింపుము, వారిని చొక్కము చేయునట్లుగా నేను వారిని కరగించుచున్నాను, నా జనులను బట్టి నేను మరేమి చేయుదును? (యిర్మియా 9:6,7). దేవుడు తన ప్రజలను అంతరంగమందు సత్యము గలిగిన వారిగా

చేయుటకు ఆయన వారిని అగ్నిగుండా తీసుకొని వచ్చును. "దేవా, నా యందు శుద్ధ హృదయము కలుగజేయుము, అని కీర్తనకారుడు ప్రార్థించెను. మనల్ని శుద్ధిచేసి మరియు అంతరంగమందు సత్యము గల్గిన ప్రజలుగా మనల్ని చేయుటకై దేవునికి మనము అవకాశమిచ్చిన కొలదీ, మన ప్రార్థన కూడా ఇట్టిదై యుండును. అంత్యదినములను గూర్చి దేవదూత దానియేలుతో చెప్పిన సంగతులను చదువుట చాలా అద్భుతమైనది. "అనేకులు తమ్మును శుద్ధిపరచుకొని ప్రకాశమానులును నిర్మలును అగుదురు" (దానియేలు 12:10a). తమ్మును శుద్ధిపరచుకొని, ప్రకాశమానులును, నిర్మలులైన 'అనేకులలో' నేను భాగస్వామి నవ్వాలని నా కోరిక. మీది అదే కోరికని నేను నమ్ముచున్నాను.

# 3
# పరీక్షించుట కొరకైన అగ్ని

**"హృదయములను అంతరింద్రియములను పరిశీలించు నీతిగల దేవా"** (కీర్తన 7:9)

గుణశీలమును పరీక్షించుటకు కూడా అగ్ని ఒక చిహ్నముగా ఉన్నది. విశ్వాసుల యొక్క తీర్పును గూర్చి మాట్లాడుతూ ప్రతివాని యొక్క పని యెట్టిదో అగ్నియే పరీక్షించునని బైబిల్ వివరిస్తున్నది (1కొరింథీ 3:13). అగ్ని ఒక పదార్థము యొక్క నిజ స్వభావమును మరియు గుణశీలమును నిర్థారించును. కాబట్టి, నిజముగా మనమెట్టి ప్రజలమో తెలుసుకొనుటకు — నిజముగా మన హృదయాలలో ఏమియున్నదో తెలుసుకొనుటకు దేవుడు మనల్ని అగ్నిగుండా తీసుకొని వెళ్ళును. అవును, దేవునికి మన హృదయ తలంపులు మరియు ఉద్దేశ్యాలు తెలుసు. అయితే మన యదార్థమైన లక్షణాలను నిర్థారించుటకై మనల్ని అగ్ని ద్వారా పంపి పరీక్షించుట మరియు పరిశీలించుట అనునది దేవునికి అనవసరమైన సంగతిగా కనబడుచున్నది. ఏమైనను, దేవుడే దీనిని చేయునని మనం లేఖనముల నుండి నేర్చుకున్నాము. తన ప్రజలను అగ్ని కొలిమిలో నుంచుట ద్వారా ఆయన వారి హృదయములను పరీక్షించును. "యెహోవా నీతిమంతులను పరిశీలించును" (కీర్తన 11:5a). లోహములు పుటము వేయబడిన అగ్నిలో పరీక్షింపబడినట్లుగానే, దేవుడు తన ప్రజల హృదయాలను పరీక్షించును. "వెండికి మూస తగినది, బంగారునకు కొలిమి తగినది హృదయ పరిశోధకుడు యెహోవాయే" (సామెతలు 17:3). "నా దేవా, నీవు హృదయ పరిశోధన చేయుచు యథార్థవంతుల యందు ఇష్టపడు చున్నావని నేనెరుగుదును" (1దిన 29:17a) అని దావీదు తన ప్రార్థనలో ప్రకటించెను. పరీక్షకు హెబ్రీ పదం 'నసాహ్', ఇది శోధించుట, పరిశీలించుట మరియు ఋజువు చేయుటగా కూడా తర్జుమా చేయబడింది. ఓ వ్యక్తి ఎలా ప్రతిస్పందిస్తాడో చూచుటకై అతన్ని పరీక్ష పెట్టుట అనే మూల ఉద్దేశ్యాన్నే ఈ పదం కనపరచును.

దేవుడు పాత నిబంధనలోని ప్రజలను పరీక్షించిన విధానాలను గూర్చి చదువుట ఆసక్తికరమైనది. మోషే, అరణ్యయాత్రను గూర్చి మాట్లాడుతూ, ఇశ్రాయేలు జనులకు చెప్పెను, "మరియు నీవు ఆయన ఆజ్ఞలు గైకొందువో లేదో నిన్ను శోధించి నీ హృదయములో నున్నది తెలుసుకొనుటకు నిన్ను అణచు నిమిత్తమును అరణ్యములో ఈ నలువది సంవత్సరములు నీ దేవుడైన యెహోవా నిన్ను నడిపించిన మార్గమంతటిని జ్ఞాపకము చేసికొనుము. ఆహారము వలననే గాక యెహోవా

సెలవిచ్చిన ప్రతి మాట వలన నరులు బ్రదుకుదురని నీకు తెలియజేయుటకు ఆయన నిన్ను అణచి నీకు ఆకలి కలుగజేసి, నీవే గాని నీ పితరులే గాని యెన్నడెరుగని మన్నాతో నిన్ను పోషించెను (ద్వితియోపదేశకాండము 8:2,3). దేవుడు వారి హృదయములను పరీక్షించుటను గూర్చి దావీదు మరియు యిర్మియా ఇద్దరూ మాట్లాడారు. "రాత్రివేళ నీవు నన్ను దర్శించి నా హృదయమును పరిశీలించితివి నన్ను పరిశోధించితివి, నీకు ఏ దురాలోచనయు కానరాలేదు, నోటి మాట చేత నేను అతిక్రమింపను" (కీర్తన 17:3). "యెహోవా నీవు నన్నెరిగి యున్నావు, నన్ను చూచుచున్నావు, నా హృదయము నీ పట్ల ఎట్లున్నది నీవు శోధించుచున్నావు, వధకు ఏర్పడిన గొఱ్ఱెలనువలె వారిని హతము చేయుము, వధ దినమునకు వారిని ప్రతిష్టించుము" (యిర్మియా 12:3). "యెహోవా, నన్ను పరిశీలించుము (వెదకుము) నన్ను పరీక్షించుము. నా అంతరింద్రియములను నా హృదయమును పరిశోధించుము (శుద్ధిచేయుము)" (కీర్తన 26:2) అని కీర్తనకారుడు ప్రార్థించినట్లు మనము ప్రార్థించగలమా?

# 4

# ఏమిటా అగ్ని

**"అయితే ఆయన వచ్చు దినమును ఎవరు సహింపగలరు? ఆయన అగుపడగా ఎవరు ఓర్వగలరు? ఆయన కంసాలి అగ్నివంటివాడు, చాకలివాని సబ్బువంటివాడు"** (మలా. 3:2)

తన ప్రజలను శుద్ధిచేయుటకై దేవుడు వినియోగించే ఆ అగ్ని ఏమిటి? దేవుడు మనల్ని పవిత్రపరిచే మరియు పరీక్షించే ఆ అగ్ని కొలిమి లేక మూస ఏమిటి? లేఖన అధ్యయనము ద్వారా సహజమైన మూడు తుది అంశాల యొద్దకు చేరుకుంటాము.

## దేవుని సన్నిధియే ఆ అగ్ని

"ఏలయనగా నీ దేవుడైన యెహోవా దహించు అగ్నియు రోషముగల దేవుడునై యున్నాడు" (ద్వి.కా. 4:24).

ద్వి.కా. 4:24 మరియు హెబ్రీ 12:29 లేఖనాలు దేవుడు దహించు అగ్ని అని మనకు చెప్పుచున్నవి. పాత నిబంధనలో దేవుని సన్నిధిని గూర్చిన అనేకమైన వాక్యాలు దృశ్యమైన అగ్ని ప్రత్యక్షతతో జతపరచబడి ఉన్నాయి. "యెహోవా అగ్నితో సీనాయి పర్వతము మీదికి దిగి వచ్చినందున అదంతయు దూమమయమై యుండెను" (నిర్గ 19:18a). "యెహోవా మహిమ ఆ కొండ శిఖరము మీద దహించు అగ్నివలె ఇశ్రాయేలీయుల కన్నులకు కనబడెను" (నిర్గమ 24:17).

మనము దేవుని సన్నిధిలోనికి ప్రవేశించు చున్నప్పుడు, మనము దహించు అగ్నియైన ఆయన సన్నిధిలోనికి ప్రవేశించుచున్నాము. ఈ సందర్భంలో, 'దహించుట' అనగా ఆయన సన్నిధిలో ఏవి అంగీకారము కావో అవి దహించి వేయబడును మరియు నాశనము చేయబడును. దేవుని సన్నిధి ఒక బలమైన దహించు అగ్నివలె యుండిన మీటింగ్స్‌లోను మరియు ప్రార్థనలోను నేను ఉన్నాను. మేము చేసినదంతా కేవలం మౌనంగా ఉండుటయే, కొన్నిసార్లు మా చెక్కిళ్లపై కన్నీటి బిందువులు జాలువారుతూ ఉండేవి. దేవుడు మా హృదయాలలో లోతైన పరిశీలన, పరీక్ష, శుద్ధీకరణ మరియు పవిత్రపరిచే కార్యాన్ని చేయుచున్నాడని మాకు తెలుసు. ఆహా! క్రమక్రమముగా అభివృద్ధి చెందే ఇటువంటి లోతైన కార్యము నేడు మనకెంతో అవసరం. దేవుడే శుద్ధిచేయు అగ్నివలె యున్నాడు. ఆయన సన్నిధిలో నిలచియుండుటనునది మనము శుద్ధి చేయబడుటకు దోహదపడుతుంది.

## దేవుని వాక్యమే ఆ అగ్ని :

"నా మాట అగ్నివంటిది కాదా?" అని యిర్మీయా 23:29లో దేవుడు ప్రశ్నిస్తున్నాడు. దేవుని వాక్యం కాల్చేటి వంటిది మరియు దహించు వంటిది. దేవుని వాక్యం మన హృదయాలను పవిత్ర పరుస్తుంది మరియు పరీక్షిస్తుంది. ఇది "మన హృదయము యొక్క తలంపులను మరియు ఉద్దేశ్యములను విశ్లేషించి, బహిర్గతపరచి, జల్లించి మరియు తీర్పు తీర్చుటకు, ప్రాణమును ఆత్మను విభజించునట్లుగా దూరుతుంది" (హెబ్రీ 4:12 యామ్ప్లిఫైడ్ బైబిల్). పాత నిబంధనలో యోసేపు అని పిలువబడిన వ్యక్తిని గూర్చి మనము చదివాము. దేవుడు అతనితో కలల ద్వారా మాట్లాడి, అతడు కలిగియుండబోయే ఉజ్వలమైన భవిష్యత్తును కనపరిచెను. ఏమైనను, అతడు బానిసగా అమ్మివేయబడి దూరదేశమునకు కొనిపోబడ్డాడు. అతడు తన కుటుంబము నుండి కొట్టివేయబడ్డాడు మరియు ఆ దూరదేశంలో అతడు చేయని తప్పుకు చెఱసాలలో వేయబడ్డాడు. "దాసుడుగా అమ్మబడి వారికంటే (ఇశ్రాయేలు జనుల) ముందుగా ఆయన (దేవుడు) యొకని పంపెను. యోసేపు దాసుడుగా అమ్మబడెను. వారు సంకెళ్లచేత అతని కాళ్లు నొప్పించిరి. ఇనుము అతని ప్రాణమును బాధించెను. అతడు చెప్పిన సంగతి నెరవేరు వరకు యెహోవా వాక్కు అతని పరిశోధించుచుండెను" (కీర్తన 105:17-19). యోసేపు దేని గుండా ప్రయాణించాడో-అదంతా ఎందుకు ప్రయాణించాడు? వాటిలో ఒక కారణం ఇక్కడ తెలుపబడింది. దేవుని వాక్యం యోసేపును శోధించింది మరియు పరీక్షించింది. దేవుని వాక్యం అగ్ని వంటిది-ఇది పరిశోధిస్తుంది మరియు పవిత్రపరుస్తుంది. దేవుడు మనతో మాట్లాడినప్పుడు మరియు ఆయన వాక్కు మనలో పెట్టబడినప్పుడు, అది నెరవేరబడుటకు ముందు ఆ వాక్కు పవిత్రపరచు క్రియ జరిగిస్తుంది మరియు మనల్ని పరీక్షిస్తుంది.

## పరిస్థితులు, శ్రమలు మరియు పరీక్షలే ఆ అగ్ని

దేవుడు తన ప్రజల హృదయాలను పరీక్షించుటకై పరిస్థితులను మరియు స్థానములను వినియోగించినట్టి అనేక సందర్భాలను మనము కనుగొంటాము. ఈ పరిస్థితులలో కొన్నింటిలో, దేవుడు తన ప్రజల నుండి అవసరమగు విధేయత క్రియను మాత్రమే కోరుకుంటాడు. కొన్ని అసాధారణ పరిస్థితులు, తన ప్రజలు ఇట్టి వాటిని తమ జీవితంలో ఎదుర్కొను చున్నప్పుడు దేవుడు 'దూరంగా నిలువబడి' తన ప్రజలు ఏమి చేస్తారా అని చూస్తాడు. ఇంకా మరికొన్ని పరిస్థితులు అవి దేవుని ప్రజలను అగ్ని పరీక్షలకు మరియు శ్రమల కొలిమికి గురిచేసేవై యున్నవి.

అబ్రహాము నుండి అవసరమైన విధేయత క్రియను బట్టి దేవుడు అతనిని పరీక్షించెను. “ఆ సంగతులు జరిగిన తరువాత దేవుడు అబ్రహామును పరిశోధించెను. ఎట్లనగా ఆయన– ‘అబ్రహామా’ అని పిలువగా అతడు–‘చిత్తము ప్రభువా’ అనెను. అప్పుడాయన–“నీకు ఒక్కడైయున్న నీ కుమారుని అనగా నీవు ప్రేమించు ఇస్సాకును తీసికొని మోరీయా దేశమునకు వెళ్ళి అక్కడ నేను నీతో చెప్పబోవు పర్వతములలో ఒక దానిమీద దహనబలిగా అతని నర్పించుమని చెప్పెను” (ఆది 22:1,2). “అప్పుడు ఆయన – ఆ చిన్న వానిమీద చెయ్యి వేయకుము, అతని నేమియు చేయకుము, నీకు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుతీయలేదు గనుక నీవు దేవునికి భయపడువాడవని యిందువలన నాకు కనబడుచున్నదనెను” (ఆది 22:12). అబ్రహాము పరీక్షలో చక్కగా ఉత్తీర్ణుడయ్యాడు.

ఐగుప్తు, బానిసత్వపు దేశం దేవుని ప్రజలకు ఒక ఇనుప కొలిమి వంటిది. “యెహోవా మిమ్మును చేపట్టి నేడున్నట్లు మీరు తనకు స్వకీయ జనముగా నుండుటకై, ఐగుప్తు దేశములోనుండి ఆ యినుప కొలిమిలో నుండి మిమ్మును రప్పించెను” (ద్వితియోపదేశకాండం 4:20).

అరణ్యము, మనమిది వరకు చూచినట్లు, దేవుడు తన ప్రజల హృదయాలను పరిశోధించింది ఈ స్థలంలోనే. “మరియు నీవు ఆయన ఆజ్ఞలను గైకొందువో లేదో నిన్ను శోధించి నీ హృదయములో నున్నది తెలుసుకొనుటకు నిన్ను అణచు నిమిత్తమును అరణ్యములో ఈ నలువది సంవత్సరములు నీ దేవుడైన యెహోవా నిన్ను నడిపించిన మార్గమంతటిని జ్ఞాపకము చేసికొనుము. ఆహారము వలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతిమాట వలన నరులు బ్రతుకుదురని నీకు తెలియజేయుటకు ఆయన నిన్ను అణచి నీకు ఆకలి కలుగజేసి నీవేగాని నీ పితరులేగాని యెన్నడెరుగని మన్నాతో నిన్ను పోషించెను” (ద్వి.కాండం 8 : 2,3).

దేవుడు దయచేసిన మన్నాను సమకూర్చుకొనుట గూర్చి ఆయన వారికి సూచన లిచ్చుచున్నప్పుడు ఆయన తన ప్రజలను పరీక్షించుచుండెను. “యెహోవా మోషేను చూచి–ఇదిగో నేను ఆకాశము నుండి మీకొరకు ఆహారమును కురిపించెదను, వారు నా ధర్మశాస్త్రము ననుసరించి నడుతురో లేదో అని వారిని పరీక్షించునట్లు ఈ ప్రజలు వెళ్ళి ఏనాటి బత్తెము ఆనాడే కూర్చుకొనవలెను” (నిర్గ16:4).

దేవుడు తన ప్రజలను పరీక్షించులాగున ఆయన కొన్ని సందర్భాలలో అబద్ధ ప్రవక్త యొక్క మాట నెరవేరుటకు అనుమతించెను. “ప్రవక్తయే గాని కలలు కనువాడే గాని నీ మధ్యలేచి నీ యెదుట సూచక క్రియయైనను మహత్కార్యమునైనను చేసి నీవు

ఎరుగని 'యితర దేవతలను అనుసరించి' 'పూజింతము రమ్మని చెప్పిన యెడల' అతడు నీతో చెప్పిన సూచక క్రియగాని, మహత్కార్యముగాని సంభవించినను ఆ ప్రవక్త మాటలను కలలు కనువాని మాటలను వినకూడదు. ఏలయనగా మీరు మీ దేవుడైన యెహోవాను మీ పూర్ణ హృదయముతోను మీ పూర్ణాత్మతోను ప్రేమించుచున్నారో లేదో తెలిసికొనుటకు మీ దేవుడైన యెహోవా మిమ్మును పరీక్షించు చున్నాడు" (ద్వితియో 13:1-3).

దేవుడు తరువాత దినాలలో శత్రువులను వినియోగించి తన ప్రజలను పరీక్షించులాగును ఆయన ఇశ్రాయేలీయులకు శత్రువులను అనుమతించెను. "కాబట్టి యెహోవా కోపాగ్ని ఇశ్రాయేలీయుల మీద మండగా ఆయన ఈలాగు సెలవిచ్చెను- ఈ ప్రజలు నా మాట వినక, వీరి పితరులతో నేను చేసిన నిబంధనను మీరుదురు గనుక నేను నియమించిన విధి ననుసరించి వారి పితరులు నడిచినట్లు వీరును యెహోవా విధి ననుసరించి నడుచుదురో లేదో ఆ జనము వలన ఇశ్రాయేలీయులను శోధించుటకై యెహోషువ చనిపోయిన కాలమున శేషించిన జనములలో ఏ జనమును వారి యెదుట నుండి నేను వెళ్ళగొట్టను. అందుకు యెహోవా ఆ జనములను యెహోషువ చేతి కప్పగింపకయు శీఘ్రముగా వెళ్లగొట్టకయు మాని వారిని ఉండనిచ్చెను" (న్యాయా 2:20-23).

బబులోను నుండి వచ్చిన రాయబారులతో హిజ్కియా కలసుకున్న పరిస్థితిలో అతనిని పరీక్షించుటకై దేవుడు తనను తాను వెనుకకు తీసుకొనెను. "అతని దేశము ఆశ్చర్యముగా వృద్ధినొందుటను గూర్చి విచారించి తెలిసికొనుటకై బబులోను అధిపతులు అతని యొద్దకు పంపిన రాయబారుల విషయములో అతని శోధించి, అతని హృదయములోని ఉద్దేశమంతయు తెలిసికొనవలెనని దేవుడతని విడచిపెట్టెను" (2 దిన 32:31).

"ఇబ్బంది కొలిమిలో నిన్ను పరీక్షించితిని" (యెషయా 48:10b) అని దేవుడు తన ప్రజలకు చెప్పుచున్నాడు. ఇబ్బందులు (వ్యాధులు మరియు రోగాలు కాదు), కష్టాలు మరియ పరీక్షలనునవి మనము పరిశోధించబడి మరియు పవిత్రపరచబడే కొలిమి కాగలవు. "ఇందువలన మీరు మిక్కిలి ఆనందించుచున్నారు గాని అవసరమును బట్టి నానా విధములైన శోధనల చేత, ప్రస్తుతమున కొంచెము కాలము మీకు దుఃఖము కలుగుచున్నది. నశించిపోవు సువర్ణము అగ్ని పరీక్ష వలన శుద్ధపరచబడుచున్నది గదా? దానికంటె అమూల్యమైన మీ విశ్వాసము ఈ శోధనలచేత పరీక్షకు నిలిచినదై, యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మీకు మెప్పును మహిమయు ఘనతయు కలుగుటకు కారణమగును" (1పేతురు 1 : 6-7).

# 5.

# అగ్ని వలన ప్రతి వానికి ఉప్పు సారము కలుగును

**"ప్రతివానికి ఉప్పుసారము అగ్ని వలన కలుగును. ఉప్పు మంచిదే గాని ఉప్పు నిస్సారమైన యెడల దేనివలన మీరు దానికి సారము కలుగజేతురు? మీలో మీరు ఉప్పు సారముగలవారై యుండి యొకరితో ఒకరు సమాధానముగా ఉండుడని చెప్పెను"** (మార్కు 9:49,50).

అగ్ని సారమును — అభివృద్ధిని మరియు పరిపక్వతను ఉత్పత్తి చేస్తుంది. సారము (ఉప్పుసారము కలుగజేయు ప్రక్రియ) కలుగజేయుట కూడా నిల్వ చేసే లేక భధ్రపరచే ఒక క్రియ. ప్రతి ఒక్కరికి అగ్ని వలన ఉప్పుసారము కలుగునని యేసు చెప్పిన దానిని గమనించండి. ఉప్పుసారము కలుగజేసే ప్రక్రియ నుండి లేక అగ్ని వలన సారము పొందే ప్రక్రియ నుండి ఏ ఒక్కరూ తప్పించుకొనజాలరు. దేవుడు క్రైస్తవుల జీవితాల్లో ఉప్పు సారము కలుగజేయు ప్రక్రియను ప్రారంభించినప్పుడు దానిని వారు గ్రహించక యుండుట వలన దేవుని యొక్క కార్యము వారికి ఆటంకముగా ఎంచబడింది. ఎవడైనను దేవునితో నడచుటకు ఇష్టపడిన యెడల - ఉప్పు సారము కలుగజేయు ప్రక్రియ స్థానంలో ఇంకేది బదులుగా ఉండలేదనియు లేక దానిని నిష్ఫలము చేయలేదనియు మనము గమనించాలి. దేవుడు కోరుచున్నదంతా ఆయన హస్తానికి అప్పగించుకొనుట మరియు లోబడుట. ఉప్పుసారము కలుగజేసే అగ్నికి మనము దూరముగా పారిపోయినప్పుడు, మనలో మనము ఉప్పు కొదువైన వారిగా ఉంటాము. మనము నిస్సారమైన ప్రజలుగా తయారయ్యి మన చుట్టునున్న లోకముపై ప్రభావమును చూపలేము.

యేసును గూర్చిన ఉదాహరణను చూడండి. యేసును గూర్చి ప్రవచనాత్మకంగా మాట్లాడుతూ, "ప్రభువగు యెహోవా ఈలాగున సెలవిచ్చుచున్నాడు — సీయోనులో పునాదిగా రాతిని వేసినవాడను నేనే. అది పరిశోధింపబడిన రాయి అమూల్యమైన తలరాయి బహు స్థిరమైన పునాదియైన మూలరాయియై యున్నది. విశ్వసించువాడు కలవరపడడు" (యెషయా 28:16, 1పేతురు 2:6) అని లేఖనములు చెప్పుచున్నవి. యేసు ఏవిధంగా పరిశోధించబడెను? ఇది ఆయన జీవితంలో ఏ ఉద్దేశమును నెరవేర్చింది? "ఎవని నిమిత్తము సమస్తమును ఉన్నవో, యెవని వలన సమస్తమును కలుగుచున్నవో, ఆయన అనేకులైన కుమారులను మహిమకు తెచ్చుచుండగా వారి రక్షణ కర్తను శ్రమల ద్వారా సంపూర్ణునిగా చేయుట ఆయనకు తగును" (హెబ్రీ 2:10). "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను

నేర్చుకొనెను మరియు ఆయన సంపూర్ణ సిద్ధి పొందినవాడై........ తనకు విధేయులైన వారికందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను” అని (హెబ్రీ 5:8-10) లో మనము మరియొక సారి చదువగలము. యేసు కూడా ‘అగ్ని వలన కలిగే ఉప్పుసారము’ గుండా వెళ్ళవలసి వచ్చెను. యేసు శ్రమలను సహించ వలసి వచ్చింది మరియు దీని ద్వారా ఆయన విధేయతను నేర్చుకొని మన రక్షణకు కర్తగా నుండుటకు తన్నుతాను ఋజువుపరచుకొని అర్హునిగా కనపరచుకొనెను. ఆయన పొందిన శ్రమల ద్వారా ఆయన పరిపూర్ణుడాయెను — సంపూర్ణ సిద్ధినొందెను, పరిపక్వతకు తీసుకురాబడెను.

## 6.

# మనము అగ్ని గుండా నడచినప్పుడు

**"నేను నడచు మార్గము ఆయనకు తెలియును. ఆయన నన్ను శోధించిన తరువాత నేను సువర్ణము వలె కనబడుదును. నా పాదములు ఆయన అడుగుజాడలు విడువక నడచినవి. నేను ఇటు అటు తొలగక ఆయన మార్గము ననుసరించితిని. ఆయన పెదవుల ఆజ్ఞను నేను విడిచి తిరుగలేదు. ఆయన నోటిమాటలను నా స్వాభిప్రాయము కంటే ఎక్కువగా ఎంచితిని"** (యోబు 23:10-12).

బహుశా నిన్ను నీవు అగ్నిలో ఉన్నట్లు కనుగొన్నావేమో. బహుశా ఉప్పుసారము కలుగజేసే ప్రక్రియను దేవుడు నీ జీవితంలో ప్రారంభించెనేమో — అగ్నితో మీరు ఉప్పు సారాన్ని పొందుచున్నారు. లేక ఇది ఇంకా మునుముందు కలదేమో, నీ జీవితములో ఉప్పు సారము కలుగజేసే ప్రక్రియ ఇంకా రావలసి ఉందేమో. దేవుడు మనల్ని మూసలో పెట్టి మన జీవితానికి ఉప్పు సారము కలుగజేసి మరియు మనల్ని శుద్ధి చేయుచున్న సమయములో మనమేమి చేయగలం?

యోబును మనం మాదిరిగా కలిగియున్నాం. యోబు యొక్క తప్పిదమేమన్న విషయాన్ని విడచిపెట్టి, మనము అతనిని అభినందించాలి మరియు అతని జీవితం నుండి పాఠాన్ని నేర్చుకోవాలి. పరీక్షలు మరియు విమర్శల గుండా ప్రయాణించి విజయముతో బయటకు వచ్చిన వ్యక్తి మనకు బోధించుటకు గాను తప్పక ఓ విలువైన పాఠాన్ని కలిగియుంటాడు. అతడు వెళ్ళుచున్న మార్గమంతా దేవునికి తెలియుననియు మరియు అదంతా ముగిసిన తరువాత అతడు సువర్ణము వలె భయటకు వస్తాడని అతడు ప్రకటించాడు. దేవుడు మనల్ని నడిపించే మార్గమును గూర్చి మనము అటువంటి గ్రహింపును మరియు ధృక్పథాన్ని కలిగియుండాలి. అటువంటి సమయంలో మనము ప్రక్కకు వైదొలగక దేవుని వాక్యాన్ని గట్టిగా పట్టుకొని ఉండాలి.

యోబును గూర్చిన వేరొక దృష్టి కోణం అతని సహనం. మీరు యోబు యొక్క సహనమును గూర్చి వింటిరి. ఆయన ఎంతో జాలియు కనికరమును గలవాడని తెలిసికొనియున్నారు" (యాకోబు 5:11b) అని మనకు చెప్పబడింది. మీ విశ్వాసము యొక్క పరీక్ష సహనమును ఉత్పత్తి చేస్తుంది, తత్ఫలితముగా కలిగిన సహనము దాని పరుగును తుదముట్టించుటకు మనము అనుమతించిన యెడల మనమేమియు కొదువలేని వారమై పరిపూర్ణులుగాను మరియు సంపూర్ణ సిద్ధినొందిన వారముగా

అవుతాము. “నా సహోదరులారా, మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి. మీరు సంపూర్ణులును, అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేని వారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి” (యాకోబు 1:2-4). మనము సహనములో నిలచియున్న కొలదీ దేవుడు మనలో క్రియచేయుటకు మరియు ఆయన ఉద్దేశము సఫలము చేయుటకు మనము అనుమతించుచున్నాము. కాబట్టి మనము నానా విధములైన శోధనలలో పడునప్పుడు వాటన్నిటిని మహానందమని యెంచుకొనవలెను.

ఆయన పడిన శ్రమ ద్వారా నేర్చుకొనిన యేసును మనము మాదిరిగా కలిగియున్నాం. జీవితంలో ఇటువంటి సమయాలలో దేవుడు మన హృదయాలలోనికి మాట్లాడే ఇంకా ఎన్నో ప్రాముఖ్యమైన విషయాలు కలవు.

మరియు మనము అగ్ని గుండా నడచినప్పుడు మనము కాలిపోమని లేక జ్వాలలు మనల్ని కాల్చవనే ప్రభువు వాగ్దానాన్ని మనము కలిగియున్నాం. “నీవు జలములలో బడి దాటునప్పుడు నేను నీకు తోడై యుందును. నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీమీద పొర్లి పారవు. నీవు అగ్ని మధ్యను నడచునప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు” (యెషయా 43:2). ఆయన దీనంతటిలోను మనతో ఉండును కాబట్టి మనకు ఏ హానియు సంభవింపదు.

# 7
# దీనియంతటి విలువ

**"వెండిలోని మష్టు తీసివేసిన యెడల పుటము వేయువాడు పాత్ర యొకటి సిద్ధపరచును"** (సామె 25:4)

దేవుని ప్రజలే ఆయన ఆభరణములు. ఆయన నామమునకు భయపడువారిని గూర్చి దేవుడు చెప్పుచున్నాడు, "నేను నియమింపబోవు దినము రాగా వారు నా వారై నా స్వకీయ సంపాద్యమై ( నా ఆభరణములై) యుందురు,......" (మలాకి 3:17). మనము ఆయన ఆభరణములుగా చేయబడక ముందు మనలోని మష్టు అంతా తొలగించబడాలి. బహుశా దీని అర్ధం మనమనేక మారులు అగ్ని గుండా వెళ్లాలని. "అవి మట్టి మూసలో ఏడుమారులు కరగి ఊదిన వెండియంత పవిత్రములు" (కీర్తన 12:6b). ఒక దినమున మనమాయన ఆభరణములుగా (స్వకీయ సంపాద్యముగా) చేయబడుదుమన్న గ్రహింపు కన్నా మరి ఏ ఆనందము మనల్ని సంతోష భరితులనుగా చేస్తుంది! మనమాయన మహిమగాను మరియు కీర్తిగా నుందుము. ఆయన మనల్ని బట్టి అతిశయించును మరియు మనల్ని అతిశయముతో ధరించుకొనును.

"దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివానిగాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించువానిగాను నిన్నునీవే దేవునికి కనపరచు కొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమోతి 2:15) అని అపోస్తలుడైన పౌలు హెచ్చరించెను. శ్రమల ద్వారా పరీక్షింపబడి నిలదక్కుకున్నవారు యోగ్యులైన పనివారుగా తమ్మును దేవునికి ఋజువు పరచుకొనువారగుదురు మరియు ఈ అంత్యకాల కోతను సమకూర్చుటకు యజమాని వాడుకునేందుకు అర్హులుగా అగుదురు. తన ప్రజలను పవిత్రపరచువానిగాను మరియు శుద్ధిచేయువానిగాను కూర్చునియున్న ఆయనను ప్రేమించుటను మనము నేర్చుకోవాలి.

# ఆల్ పీపుల్స్ చర్చ్ గురించి

బెంగుళూరు పట్టణానికి ఉప్పుగాను మరియు వెలుగుగాను ఉండాలని మరియు భారత దేశానికి మరియు ఇతర దేశాలకు దేవుని స్వరముగా ఉండాలనునది ఆల్ పీపుల్స్ చర్చ్ యొక్క దర్శనం.

ఇది మీకు మేమందిస్తున్న ఒక బహుమానం! ఇది ఉచితం!

ఈ పుస్తకాన్ని చదువుట ద్వారా మీరు ఆశీర్వదింపబడ్డారని మేము నమ్ముచున్నాము.

మీ వలె కొన్ని వేలమందికి ఈ పుస్తకాలు ఉచితముగా పంచబడ్డాయి. దేవుని వాక్యమును అనేకులతో పంచుకొనుటకు గాను, మీరు ఆర్థికంగా సహాయపడి మాతో భాగస్థులు కావలెనని ఆశించుచున్నాము. క్రమముగా మీరు ఇచ్చే ఆర్థిక సహకారము ఇతరులకు దేవుని వాక్యాన్ని అందజేయుటకు దోహదపడుతుంది. ప్రభువు మిమ్మును నడిపించిన ప్రకారము ఆల్ పీపుల్స్ చర్చ్‌తో భాగస్వాములు అవ్వండి. మీరు మీ ఆర్థిక సహాయాన్ని చెక్కు/డిమాండు డ్రాఫ్ట్/ మనియార్డరు ద్వారా "All Peoples Church, Bangalore" పేరుతో పంపగలరు.

మీరు మాకు లెటర్ వ్రాసేటప్పుడు ఇతర ప్రచురణలను కొరకు అడుగగలరు. మీ అభిప్రాయములు, ప్రార్థన అవసరతలతో పాటు ఈ పుస్తకం మీకు ఏలా సహాయపడిందో కూడా తెలియపరచండి. ఈ క్రింది చిరునామా ద్వారా మాతో సంప్రదించగలరు :


ALL PEOPLES CHURCH,
370, 11th Cross, 2nd Block,
R.T. Nagar, Bangalore-560 032
Karnataka, India.

Phone : 91-80 2354 4328
Email: contact@apcwo.org
Website: www.apcwo.org